


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
26-01-2026
పేజీలు: 02



## బాలీవుడ్‌పై తీవ్ర విమర్శలు చేసిన ప్రకాశ్ రాజ్

దక్షిణాది నుంచి ఉత్తరాది వరకు వైవిధ్యమైన సినిమాలతో మెప్పించిన నటుల్లో ప్రకాష్ రాజ్ ఒకరు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆయన సినీ ప్రయాణం అనేక మైలురాళ్లతో నిండింది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడతో పాటు హిందీ చిత్రాల్లోనూ ఆయన తన నటనతో మెప్పించారు. కేవలం నటనకే పరిమితం కాకుండా, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తపరిచే వ్యక్తిత్వం కూడా ప్రకాష్ రాజ్‌కు ప్రత్యేకతను తీసుకొచ్చింది. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు మరోసారి సినీ వర్గాల్లోనూ, సామాజిక వేదికలపైనా చర్చనీయాంశంగా మారాయి. కేరళలోని కోజికోడ్‌లో జరిగిన ప్రతిష్టాత్మక 'కేరళ లిటరేచర్ ఫెస్టివల్'లో పాల్గొన్న ప్రకాష్ రాజ్, హిందీ చిత్ర పరిశ్రమ ప్రస్తుత పరిస్థితిపై తీవ్ర స్థాయిలో స్పందించారు.







# స్వేచ్ఛ లేకుండా అభివృద్ధి లేదు, ఐక్యతే బలం

## ప్రధాని మోదీ

77వ గణతంత్ర దినోత్సవాన్ని భారతదేశం అంతటా ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. దేశ రాజధాని ఢిల్లీలో ఆర్మీ, వైమానిక దళం, నావికాదళం, సాంస్కృతిక శకటాలు, వివిధ ప్రదర్శనలతో కూడిన గ్రాండ్ కవాతు , వేడుక జరుగుతుంది. కవాతు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రభుత్వం జనవరి 26 (నేడు) నుండి ఎర్రకోట ప్రాంగణంలో ఆరు రోజుల జాతీయ సాంస్కృతిక, పర్యాటక ఉత్సవం అయిన భారత్ పర్వ్‌ను నిర్వహించనుంది. దీనిని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ప్రారంభిస్తారని పర్యాటక మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్ పర్వ్ అనేది మంత్రిత్వ శాఖ ప్రధాన వార్షిక కార్యక్రమం. ఇది భారతదేశం గొప్ప సాంస్కృతిక, కళాత్మక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని జరుపుకుంటుంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఒక వీడియోను షేర్ చేశారు. స్వేచ్ఛ లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం మన స్వాతంత్ర్యం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలకు శక్తివంతమైన చిహ్నం అని ఆయన అన్నారు. ఈ పండుగ మనకు కొత్త శక్తిని, దేశాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఐక్యంగా ముందుకు సాగడానికి ప్రేరణను ఇస్తుంది. ఆయన ఒక శ్లోకాన్ని కూడా పంచుకున్నారు.

బీజేపీ ప్రధాన కార్యాలయంలో జెండా ఆవిష్కరణ

ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నవీన్ జాతీయ జెండాను ఎగురవేశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా తన నివాసంలో జాతీయ జెండాను ఎగురవేసి, అక్కడ ఉన్న భద్రతా సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు.

తెలుగు రాష్ట్రాలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

తెలుగు రాష్ట్రాల్లో గణతంత్ర దినోత్స వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ జెండాను ఆవిష్కరించారు. అటు ఏపీలో కూడా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

పరేడ్ గ్రౌండ్ లో

దేశవ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు అట్టహాసంగా సాగాయి. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్..

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీలోని తన నివాసంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "గణతంత్ర దినోత్సవం సందర్భంగా, దేశ పౌరులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

రాజ్యాంగాన్ని రక్షించడం అంటే భారత గణతంత్రాన్ని రక్షించడమే — రాహుల్ గాంధీ

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ Xలో ఆయన ఇలా రాశారు. "గణతంత్ర దినోత్సవం సందర్భంగా నా దేశస్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. మన రాజ్యాంగం ప్రతి భారతీయుడి గొప్ప ఆయుధం. అది మన గొంతు, మన హక్కుల కవచం అని అన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మోదీ

ఢిల్లీలో కర్తవ్యపథ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. వేడుకలకు ప్రధాని మోదీ హాజరయ్యారు. వందేమాతరం థీమ్‌తో వేడుకలు ప్రారంభం అయ్యాయి. ఈ రిపబ్లిక్ వేడుకలకు ఐదంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కార్తవ్యపథ్ దగ్గర 6 కంట్రోల్ రూమ్స్‌ను ఏర్పాటు చేశారు.

శుభాన్షు శుక్లాకు అశోక్ చక్ర అవార్డును అందించిన రాష్ట్రపతి

ఢిల్లీ కర్తవ్యపథ్ గణతంత్ర దినోత్స వేడుకల్లో భారతదేశ ప్రతిష్ఠాత్మక అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్' వ్యోమగామి, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లాను శాంతికాలంలో ఇచ్చే అత్యున్నత సైనిక పురస్కారం 'అశోక చక్ర' వరించనుంది. ఈ అశోక చక్రను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అందించారు.

ఆర్మర్డ్ లైట్ స్పెషలిస్ట్ వాహనం

భారతదేశంలోనే మొట్టమొదటి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఆర్మర్డ్ లైట్ స్పెషలిస్ట్ వాహనం అయిన హై మొబిలిటీ రికనైసెన్స్ వెహికల్ ఢిల్లీలో ప్రదర్శనకు ఉంచారు. దీనిని మహీంద్రా డిఫెన్స్ సిస్టమ్స్ అభివృద్ధి చేసి 2023లో ప్రారంభించింది. ఇది మానవులు, వాహనాలు, తక్కువ ఎత్తులో ఎగిరే హెలికాప్టర్‌లను గుర్తించగల యుద్ధభూమి నిఘా రాడార్‌తో పాటు రాడార్ బ్లైండ్ జోన్‌లను కవర్ చేయడానికి డ్రోన్‌లు, అధునాతన కమ్యూనికేషన్‌లు, యాంటీ-డ్రోన్ గన్‌లను కలిగి ఉంటుంది.





## ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడికి యత్నం

జనగామలో ఇటీవలే కాంగ్రెస్ గుండాలు రెచ్చిపోయి మంత్రి సీతక్క సమక్షంలోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై దాడికి యత్నించారని తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే కాంగ్రెస్ నేతలు మరోసారి రెచ్చిపోయారు. నేడు దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై కాంగ్రెస్ గుండాలు దాడికి యత్నించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాకలో గాంధీ సెంటర్ వద్ద గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయినా ఒక్క రూపాయి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసి ముఖ్యమంత్రి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో ఉన్నది ఉన్నట్టు అంటే ఉలుకు ఎక్కువ అన్నట్టు.. జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడవద్దంటూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో వాగ్వివాదానికి దిగారు.. ఎండగడతామని వారికి ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొని వెళ్తున్న ఎమ్మెల్యే కారును అడ్డుకొని కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించగా వారిని బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకున్నారు. ప్రజాస్వామ్యం లో ప్రశ్నించడమే పాపంగా మారిందని.. దాడులకు తెగబడుతున్న కాంగ్రెస్ గూండాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.









## అమరావతిలో మొదటిసారిగా రిపబ్లిక్ డే వేడుకలు... సీఎం చంద్రబాబు స్పందన

ప్రజా రాజధాని అమరావతిలో తొలిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఏడాది రిపబ్లిక్ డే రాష్ట్ర ప్రజలకు ఎంతో గర్వకారణమని, చిరకాలం గుర్తుండిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ చారిత్రక సందర్భంపై చంద్రబాబు సోమవారం స్పందిస్తూ.. అమరావతిలో మువ్వన్నెల జెండాను ఎగురవేయడం ఆనందంగా ఉందన్నారు. వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ఎజెండాను, భవిష్యత్ కార్యాచరణను గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ స్పష్టంగా వివరించారని, ఇందుకు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని ట్వీట్ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రాండ్ పరేడ్, అందంగా తీర్చిదిద్దిన శకటాల ప్రదర్శన మన సమష్టి ఆశయాలకు, భవిష్యత్ దృష్టికి అద్దం పట్టాయని చంద్రబాబు ప్రశంసించారు. ఈ వేడుకలను వీక్షించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొంటూ 'జై హింద్' అని తన ప్రకటనను ముగించారు.

## భారత్ కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ లో మరో డిమాండ్

బంగ్లాదేశ్ లో నానాటికీ భారత వ్యతిరేకత పెరిగిపోతోంది. యూనస్ సర్కారు ధోరణితో భారత్— బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు వేగంగా క్షీణిస్తుండగా.. తాజాగా ఆ దేశంలో మరో డిమాండ్ ఊపందుకుంది. భారత్ కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలంటూ అక్కడి వస్త్ర పరిశ్రమ నుంచి ప్రభుత్వానికి ఒత్తిడి పెరుగుతోంది. ప్రస్తుతం భారత నూలుకు కల్పిస్తున్న డ్యూటీ-ఫ్రీ సౌకర్యాన్ని వెంటనే తొలగించాలని పరిశ్రమ వర్గాలు పట్టుబడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే దీనికి అనుగుణంగా నిర్ణయం తీసుకోకుంటే వచ్చే నెల 1 నుంచి కర్మాగారాలు మూసివేస్తామని అల్టిమేటం జారీ చేశాయి. ఈ మేరకు ఆ దేశ వాణిజ్యశాఖ నుంచి నేషనల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూకు లేఖ అందినట్లు యూనస్ ప్రభుత్వం పేర్కొంది.

## రష్యాలో కార్మికుల కొరత



తీవ్రమైన కార్మికుల కొరతను ఎదుర్కొంటున్న రష్యా, ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు భారత్ వైపు చూస్తోంది. ఈ ఏడాది దాదాపు 40,000 మంది భారతీయ కార్మికులను నియమించుకోవడానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే సుమారు 70,000 నుంచి 80,000 మంది భారతీయులు గత ఏడాది చివరి నాటికి రష్యాలో పనిచేస్తున్నట్లు అంచనా. భారతదేశం నుంచి నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం ఉన్న కార్మికులను రష్యాకు పంపించే ప్రక్రియను సులభతరం చేసేందుకు గత డిసెంబర్‌లో ఇరు దేశాలు రెండు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాల ద్వారా కార్మికుల తరలింపు ప్రక్రియను క్రమబద్ధీకరించడంతో పాటు, గతంలో జరిగిన మోసాల వంటివి పునరావృతం కాకుండా వారికి రక్షణ కల్పించనున్నారు. dw.com కథనం ప్రకారం, రష్యాలో దాదాపు 5 లక్షల మంది పాక్షిక నైపుణ్యం ఉన్న కార్మికులకు డిమాండ్ ఉంది. మొత్తం మీద 30 లక్షల మంది నిపుణుల కొరతను ఆ దేశం ఎదుర్కొంటోందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల వ్యాఖ్యానించారు. భారతదేశంలోని యువత, నైపుణ్యం గల శ్రామిక శక్తి ఈ లోటును తీర్చగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల, రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో వీధులు శుభ్రం చేసే పనిలో ఓ భారతీయ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌తో సహా 17 మంది కార్మికులు ఉన్నట్లు రష్యన్ మీడియా 'ఫొంటాంకా' నివేదించడం గమనార్హం.

## కాస్టింగ్ కౌచ్ పై చిరంజీవి ఆసక్తికర వ్యాఖ్యలు





సంక్రాంతికి థియేటర్లలో దూసుకెళ్లిన మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొడుతోంది. అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ యాక్షన్-కామెడీ చిత్రం విడుదలైన 10-14 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 247 కోట్లకు పైగా వసూళ్లు చేసి, ఇప్పుడు రూ. 300 కోట్ల మార్క్‌ను దాటుతోంది. ఈ ఘన విజయం నేపథ్యంలో తాజాగా హైదరాబాద్‌లో భారీ సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ అనేది లేదు. మగ పిల్లలైనా, ఆడ పిల్లలైనా చిత్ర పరిశ్రమలోకి వస్తే ఎంకరేజ్ చేయాలి. ఇండస్ట్రీ అద్దం లాంటిది... మనం ఎలా బిహేవ్ చేస్తే, రిజల్ట్ కూడా అలాగే ఉంటుంది. ఇక్కడ ఎవరి వర్కింగ్ స్టైల్ వారిది. బాగాలేదు, ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని అంటే అది వారి తప్పిదమే" అని అన్నారు. ఇక 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా గురించి స్పందిస్తూ... "అన్నం, అమ్మ, సినిమా సక్సెస్ ఎప్పుడూ బోర్ కొట్టవు. ఈ సినిమా సక్సెస్ తర్వాత కొందరు చెప్పిన మాటలు నన్ను ఎమోషనల్ చేశాయి.

## బోర్డర్ దాటే ప్రయత్నంలో అమెరికా పోలీసులకు పట్టుబడుతున్న భారతీయులు



అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించే వలసదారుల్లో భారతీయుల సంఖ్యే ఎక్కువని తాజా నివేదికల్లో బయటపడింది. అక్రమంగా సరిహద్దులు దాటి పెద్దసంఖ్యలో భారతీయులు పట్టుబడుతున్నారని తేలింది. యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ పోలీస్ నివేదిక ప్రకారం.. గతేడాది సగటున ప్రతీ 20 నిమిషాలకు ఓ భారతీయుడిని అరెస్టు చేసినట్లు సమాచారం. మొత్తంగా 2025 లో 23,830 మంది భారతీయులు సరిహద్దుల వద్ద పట్టుబడ్డారని పోలీసులు తెలిపారు. 2024 ఏడాదిలో ఇదేవిధంగా 85,119 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. కాగా, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించాక ఇమ్మిగ్రేషన్ చట్టాలను కఠినంగా మార్చిన విషయం తెలిసిందే. అక్రమ వలసలపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని బోర్డర్ పోలీసులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. దీంతో చాలావరకు అక్రమ వలసలను అధికారులు కట్టడి చేశారు. శిక్షలకు భయపడి బోర్డర్ దాటేందుకు చాలామంది సాహసించడంలేదు. అయినప్పటికీ భారతీయులు మాత్రం ఎలాగైనా అమెరికాలో అడుగుపెట్టాలని బోర్డర్ క్రాస్ చేసేందుకు తెగిస్తున్నారని ఆరోపించారు.

## రెండోసారి తల్లి కాబోతున్న టాలీవుడ్ బ్యూటీ పూర్ణ



టాలీవుడ్‌లో ఒకప్పుడు హీరోయిన్‌గా మెరిసిన పూర్ణ ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టుగా బిజీగా ఉంది. పలు సినిమాల్లో కథానాయికగా ప్రేక్షకులను మెప్పించిన పూర్ణ... ఇప్పుడు సపోర్టింగ్ రోల్స్‌తో పాటు టీవీ షోలు, డ్యాన్స్ ప్రోగ్రామ్స్‌లో కూడా సందడి చేస్తోంది. ఈ దంపతులకు ఒక కుమారుడు హమ్దాన్ ఆసిఫ్ అలీ ఉన్నాడు. ఇప్పుడు మరో శుభవార్త ఏమిటంటే... పూర్ణ రెండోసారి తల్లి అవుతోంది. ఈ క్రమంలో తాజాగా, బేబీ బంప్‌తో తీసుకున్న అద్భుతమైన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పూర్ణ షేర్ చేసింది.

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
EVENING EDITION 4PM

# ప్రెస్ స్టిక్కర్లపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

మీడియా ముసుగులో చెలామణి అవుతున్న నకిలీ జర్నలిస్టులకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అధికారిక అక్రిడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్‌ను ఉపయోగించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ (I&PR) కమిషనర్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో కొందరు కేవలం యూట్యూబ్ ఛానెళ్లు లేదా ఇతర ప్రైవేటు సంస్థల ఐడీ కార్డులను చూపిస్తూ వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్లను విరివిగా వాడుతున్నారని, దీనివల్ల అసలైన జర్నలిస్టుల ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. సెంట్రల్ మోటార్ వెహికల్ చట్టం-1989 ప్రకారం వాహనాలపై లేదా నంబర్ ప్లేట్లపై అనధికారికంగా 'ప్రెస్', 'పోలీస్', 'గవర్నమెంట్' వంటి పదాలను వాడటం చట్టరీత్యా నేరం. ఈ కొత్త నిబంధనలను అతిక్రమించి అక్రిడిటేషన్ లేకుండా 'ప్రెస్' స్టిక్కర్లను వాడితే ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. అలాంటి వ్యక్తులకు భారీ జరిమానాతో పాటు అవసరమైతే వాహనాన్ని సీజ్ చేసే అధికారం కూడా రవాణా శాఖకు ఉందని అధికారులు హెచ్చరించారు. అక్రిడిటేషన్ లేని వారు తమ వాహనాలపై ఉన్న స్టిక్కర్లను వెంటనే తొలగించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో పోలీస్ మరియు రవాణా శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో టోల్ ప్లాజాలు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నకిలీ జర్నలిస్టుల వల్ల తలెత్తుతున్న గందరగోళానికి తెరపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, అక్రిడిటేషన్ లేని నిజమైన ఫీల్డ్ రిపోర్టర్లకు ఇది కొంత ఇబ్బంది కలిగించే అవకాశమున్నప్పటికీ, జర్నలిజం వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు ఈ చర్య అవసరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు.






## పనిమనిషిపై పదేళ్లుగా అత్యాచారం..
### దురంధర్ నటుడి అరెస్టు

బాలీవుడ్ నటుడు నదీమ్ ఖాన్‌ను అత్యాచారం కేసులో ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. తన ఇంట్లో పనిచేసే 41 ఏళ్ల మహిళపై పదేళ్లుగా లైంగిక దాడికి పాల్పడినట్టు ఆయనపై ఆరోపణలు నమోదయ్యాయి. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఈ దారుణానికి ఒడిగట్టారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఇటీవలే రణ్‌వీర్ సింగ్ నటించిన 'దురంధర్' సినిమాలో నదీమ్ ఖాన్ ఒక పాత్రలో కనిపించారు. వివరాల్లోకి వెళితే, బాధితురాలు పలువురు నటుల ఇళ్లలో పనిచేస్తుండగా కొన్ని సంవత్సరాల క్రితం నదీమ్ ఖాన్‌తో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో వీరి మధ్య సంబంధం కొనసాగింది. ఈ క్రమంలో మాల్వానీలోని తన నివాసంలో, వెర్సోవాలోని నదీమ్ ఖాన్ ఇంట్లో పలుమార్లు తనపై అత్యాచారం చేశాడని బాధితురాలు ఆరోపించింది. అయితే, ఇటీవల నదీమ్ ఖాన్ పెళ్లికి నిరాకరించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మొదట వెర్సోవా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం, మొదటి ఘటన జరిగిన ప్రాంతం మాల్వానీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండటంతో కేసును అక్కడికి బదిలీ చేశారు. కేసును విచారించిన మాల్వానీ పోలీసులు జనవరి 22న నదీమ్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు.

## పలహారం లెక్క మేడారం జాతర
# పాసులు పంచలేం: మంత్రి సీతక్క

మేడారం మహాజాతర సందర్భంగా లక్షలాది మంది భక్తులు మొక్కుల చెల్లింపుల కోసం తరలివస్తుంటారని మంత్రి సీతక్క అన్నారు. కాబట్టి వీఐపీల కోసం మేడారం వీఐపీ, వీవీఐపీ పాసులను పలారం పంచినట్లుగా పంచలేమని తెలిపారు. వీఐపీలు స్పెషల్‌గా వస్తే గొప్పదనం కాదని.. పబ్లిక్‌గా వస్తేనే గొప్పదనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. లక్షల పాసులు కొట్టిస్తే సాధారణ భక్తులు ఎలా దర్శనం చేసుకుంటారనే విషయాన్ని ఆలోచిస్తున్నామని సీతక్క తెలిపారు. అందుకే అసలు జాతరలో పాసుల విధానాన్ని రద్దు చేసేందుకు ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. పాసుల జారీ విషయంలో స్థానిక, స్థానికేతర ప్రజాప్రతినిధులను గౌరవించి, ఇప్పటికే పాసులు జారీ చేశామన్నారు. అధికంగా పాసుల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులను ఒత్తిడి చేయవద్దని, వీఐపీలు క్రమశిక్షణగా వ్యవహరించాలని సూచించారు. సాధారణ భక్తుల కోసం వీఐపీలు సైతం పునరాలోచన చేయాలన్నారు. రేపటి నుంచి సమ్మక్క సారలమ్మ గద్దెల మీదకు భక్తులను



అనుమతించేది లేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. క్యూలైన్ల ద్వారా దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రతి భక్తుడు క్రమశిక్షణగా స్వీయ నియంత్రణ పాటించి, క్యూలైన్ల ద్వారా వస్తేనే బాగుంటుందని సూచించారు..



## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి..
# కేటీఆర్ పిలుపు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోను సీఎం రేవంత్ రెడ్డి తుంగలో తొక్కుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అనేక అబద్ధాలు, అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పక్కన పెట్టారు, పరిపాలన వదిలేశారని మండిపడ్డారు. చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత, మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఇవాళ బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇలా హామీలిచ్చి అందర్నీ మోసం చేస్తుందని ఆనాడే చెప్పామని.. అన్నట్లుగానే రెండేళ్లలో రేవంత్ రెడ్డి ఏ ఒక్క వర్గాన్ని వదిలిపెట్టకుండా అందర్నీ మోసం చేశాడని తెలిపారు. వృద్ధుల నుంచి మొదలు ఆడబిడ్డల వరకు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు.. ఇలా అందర్నీ రేవంత్ రెడ్డి మోసం చేస్తూనే ఉన్నాడని అన్నారు. కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్న అన్ని వర్గాలు ఈరోజు కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. శాసనసభ స్పీకర్ ధృతరాష్ట్రుని లెక్క మారాడని.. కళ్ళకు గంతలు కట్టుకొని నిజాలు చూడలేకపోతున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో ,చేరి కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటే స్పీకర్ మాత్రం గుర్తించడం లేదని విమర్శించారు. యాదయ్య ఇంకా భారత రాష్ట్ర సమితిలోనే ఉన్నాడని చెబుతున్నాడని పేర్కొన్నారు. కాలె యాదయ్య గెలిపించిన పార్టీని వదిలిపెట్టి పదవుల కోసం, పైసల కోసం కాంగ్రెస్ పార్టీలోకి పోయాడని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని యాదయ్య చెబుతున్నారు.. కానీ స్పీకరే ఒప్పుకోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే తమ పార్టీలో చేరిన కాలె యాదయ్యపై చర్యలు తీసుకొని.. ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు. అందర్నీ మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఒకవేళ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మళ్లీ అదే మోసం కొనసాగుతుందని హెచ్చరించారు. కేసీఆర్ వస్తేనే ఈ రాష్ట్రం బాగుపడుతుందని.. రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. అందరూ కలిసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు.



# ఐటం సాంగ్స్‌కి బ్రేక్

ఒకప్పుడు సినిమాల్లో ఐటం పాట అంటే ప్రత్యేకంగా ప్రొఫెషనల్ డాన్సర్లే గుర్తొచ్చేవారు. ఆ పాటల్లో వాళ్లు కనిపిస్తేనే హిట్ అనే స్టాండర్డ్ ఉండేది. కానీ కాలం మారింది. ఇప్పుడు అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నటీమణులే ఐటం సాంగ్స్‌లోనూ స్టెప్పులేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఒకే సినిమాలో హీరోయిన్ పారితోషికంతో పాటు స్పెషల్ సాంగ్ ఫీజు కూడా అందుకుంటూ డబుల్ లాభం పొందుతున్నారు.ఈ ట్రెండ్‌కు అనుగుణంగానే గత కొన్నేళ్లుగా సమంత, కాజల్ అగర్వాల్, తమన్నా, పూజా హెగ్డే, శ్రీలీల వంటి స్టార్ హీరోయిన్లు ఐటం పాటల్లో కనిపించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఇదే ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద సినిమాల్లో ఐటం సాంగ్ అంటే స్టార్ హీరోయిన్ ఉండాల్సిందే అనే పరిస్థితి ఏర్పడింది.

## అయ్యప్పమాలలో రవితేజ..
# 'ఇరుముడి' ఫస్ట్ లుక్

మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రేక్షకుల్లో ఆ సినిమాలు పూర్తి సంతృప్తిని కలిగించలేకపోయాయి. మాస్ ఇమేజ్‌కు కాస్త విరామం ఇచ్చి, క్లాస్ టచ్‌తో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో రవితేజ తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.ఈ క్రమంలోనే ఆయన దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. అయ్యప్ప స్వామి మాలధారణలో రవితేజ కనిపించిన లుక్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. పోస్టర్ చూసిన వెంటనే ఒక డివోషనల్ ఫీల్, పాజిటివ్ వైబ్స్ కలుగుతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయ్యప్ప మాలధారణలో ఇరుముడికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సినిమాలో ఎమోషనల్‌గా, డీప్‌గా చూపించబోతున్నారని సమాచారం. సెన్సిటివ్, క్లాస్ కథనాలతో పేరు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈసారి డివోషనల్ టచ్‌తో కథను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మాస్‌కు భిన్నంగా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా రవితేజ కొత్త ఇమేజ్‌ను ఆవిష్కరించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది.






## ముద్రగడ టీడీపీలో చేరబోతున్నారా?

పెద్దాపురం టీడీపీ ఎమ్మెల్యే చినరాజప్పతో వైసీపీ కీలక నేత ముద్రగడ పద్మనాభం భేటీ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. 2024 ఎన్నికల ముందు వైసీపీలో చేరిన ముద్రగడ కూటమిని ఓడించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే కూటమి పాలనపై ప్రజా వ్యతిరేకత నెమ్మదిగా వస్తోంది. దాన్ని క్యాష్ చేసుకోవాలని ముద్రగడకు జగన్ దిశానిర్దేశం చేశారు. ఆ పనిలో చురుకుగా ఉన్న ముద్రగడ ఇప్పుడు చినరాజప్పను కలవడంపైనే చర్చ సాగుతోంది. దాంతో ముద్రగడ టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పుకార్లు వినిపిస్తున్నాయి.మరోవైపు 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు మాజీ మంత్రి ముద్రగడ వైసీపీలో చేరారు. చాలా రోజులు రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన.. ఎన్నికల సమయంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌ను ఓడించటానికి తీవ్రంగా కృషిచేశారు. వైసీపీ అభ్యర్థి వంగా గీత విజయం కోసం శక్తివంచన లేకుండా పని చేశారు ఈ క్రమంలోనే పిఠాపురంలో పవన్ కళ్యాణ్ గెలిస్తే పేరు మార్చుకుంటానంటూ ముద్రగడ అప్పట్లో ఛాలెంజ్ చేయటం రాజకీయంగా సంచలనం రేపింది.